

సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి - ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు 8లో..

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలపై నిరసనలు 8లో..



కేసీ వేణుగోపాల్ సమక్షంలో ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత

మారనున్న రాజకీయ సమీకరణాలు

- బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చిన ఎంపీ వెంకటేష్ నేత
- ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీలో చేరిక
- టికెట్ హామీతోనే చేరారనే ప్రచారం
- ఆందోళనలో ఆశావహులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

బీఆర్ఎస్ పార్టీకి చెందిన పెద్దపల్లి నియోజకవర్గ సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీకి షాకిచ్చారు. దీంతో ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇస్తామనే హామీతోనే ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లుగా ప్రచారం జరుగుతున్నది. ఆయన చేరికతో పార్టీ టికెట్‌పై ఆశలు పెంచుకున్న ఆశావహులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన ఒక సిట్టింగ్ ఎంపీ కాంగ్రెస్‌లో చేరడం రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీకి కలిసి వచ్చే అంశమే అయినప్పటికీ, కాంగ్రెస్ టికెట్ కోసం ఆశావహులు చేస్తున్న ప్రయత్నాలకు కొంత బ్రేకులు పడినట్లవుతున్నది. ఎంపీ వెంకటేష్ నేతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ రాదని, ఆయన బీజేపీ వైపు చూస్తున్నారని ప్రచారం జరుగుతున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ద్వారాలు తెరవడం సంచలనంగా మారింది. వెంకటేష్ నేత కాంగ్రెస్ లోకి వస్తానంటే తీసుకునే పరిస్థితి లేదని, ఒకవేళ వచ్చినా టికెట్ ఇవ్వరనే ప్రచారం కాంగ్రెస్‌లో జరిగింది. ఏఐసీసీ స్థాయిలో పక్కా టికెట్ హామీ లభించిన తర్వాతనే ఆయన తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారనే చర్చ జరుగుతున్నది. ఆయన చేరికపై తెర వెనుక మంచిర్యాల జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే మంత్రాంగం నడిపించారని తెలస్తున్నది. పార్లమెంట్ ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు గానీ, నియోజకవర్గంలోని ఇతర ఎమ్మెల్యే లకు గానీ వెంకటేష్ నేత చేరిక సమాచారం ఉందా, లేదా అనేది తెలియడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసి క్లీన్ స్వీప్ చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు నల్లేరు మీద నడకేనని పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఈక్రమంలో పార్టీ టికెట్ కోసం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మాజీ ఎంపీ వివేక్ తయయుడు గడ్డం వంశీకృష్ణ, టీపీసీసీ కార్యదర్శి గోమాసె శ్రీనివాస్, తటస్థంగా ఉన్న మాజీ ఎంపీ డాక్టర్ సుగుణ కుమారి, పార్టీ నాయకులు ఊట్ల వరప్రసాద్, ఆసంపెల్లి శ్రీనివాస్, బూడిద మల్లేష్, పెర్క శ్యామ్, తెలంగాణ ఉద్యమకారుడు ఈర్ల సురేందర్, తదితరులు పార్టీ టికెట్ కోసం రూ.25 వేలు చెల్లించి టీపీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో నేత కాని, మాదిగ సామాజికవర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువగా ఉండ డంతో ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారికి టికెట్ ఇవ్వాల నే డిమాండ్లు వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వివేక్‌కు చెన్నూరు టికెట్ ఇవ్వగా, ఎంపీ టికెట్ తన కుమారుడు వంశీకృష్ణకు ఇవ్వాలని పట్టుబడు తున్నారు. ఒకే కుటుంబ ంలో అసెంబ్లీ ఎన్నికల్లో వివేక్, వినోద్ కుమార్‌లకు టికెట్లు ఇచ్చారని, ఎంపీ టికెట్ తమకే ఇవ్వాలని మిగతా నేతలు పార్టీ దృష్టికి తీసుకవెళు తున్నారు. ఈక్రమంలో పార్టీ టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుం టుండగా, అనూ హ్యంగా వెంకటేష్ నేత కాంగ్రెస్‌లో చేరి బీఆర్ ఎస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్న ఆశావహులకు షాక్ ఇచ్చారు.

● ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి..

2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎక్సైజ్ శాఖలో డీసీగా పనిచేసిన వెంకటేష్ నేత రాజకీయాలపై మక్కువతో ఉద్యోగాన్ని వదులుకుని కాంగ్రెస్ పార్టీలో చేరి చెన్నూరు నుంచి పోటీచేసి ఓటమి చెందారు. తర్వాత నాలుగు మాసాలకే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా వివేక్‌కు టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకించి అనూహ్యంగా వెంకటేష్ నేతను పార్టీలోకి తీసుకవచ్చి టికెట్ ఇప్పించడంతో ఆయన గెలుపొందారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించినప్పటికీ, ఒక్క అభ్యర్థి కూడా గెలుపొందలేదు. కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడంతో బీఆర్ఎస్ పార్టీ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బలమైన నాయకుడిని పోటీలో నిలపాలని భావించింది. ఎంపీ వెంకటేష్ నేతకు ప్రజలతో, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో సత్సంబంధాలు లేకపోవడం, ప్రజలకు అందుబాటులో లేకపోవడం, కనీసం ఫోన్ చేసినా స్పందించని పరిస్థితి ఉండడంతో ఆయనకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ అభ్యర్థికి ధీటుగా పోటీ ఇవ్వలేరని అభిప్రాయం బీఆర్ఎస్ నేతల్లో ఉన్నది. ఈక్రమంలో ఆయనకు బదులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు గానీ, బాల్క సుమన్‌ను గానీ పోటీలో నిలుపుతారనే ప్రచారం జరుగుతున్నది. పార్టీ అధినేత కొప్పుల అభ్యర్థిత్వంపైనే మొగ్గు చూపగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకే టికెట్ ఇస్తామని పార్టీ మారవద్దని వెంకటేష్ నేతకు సూచించినట్లు సమాచారం. ఆయన మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో మంచిర్యాల జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యే అండదండలతో వెంకటేష్ నేత ఢిల్లీ స్థాయిలోనే మంత్రాంగం జరిపి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రచారం జరుగుతున్నది. అయితే పార్టీ టికెట్ వెంకటేష్ నేతకే ఇస్తారా, మరెవరికైనా ఇస్తారా వేచిచూడాల్సిందే.

ఆయిల్‌పామ్ సాగుపై సందేహాలను నివృత్తి చేసుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభిస్తున్న రైతు

పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా అధ్యయనం చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆయిల్ పామ్ సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వెళ్తున్న రైతులతో తన ఛాంబర్‌లో మాట్లాడారు. కేరళ, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాలలో సైతం వరి ధాన్యం సాగు పెరుగుతుందని, దీనివల్ల మార్కెట్లో వరి డిమాండ్ రోజు రోజుకు తగ్గుతుందని, ఇప్పటికే గోడౌన్లలో ధాన్యం నిల్వలు పేరుకు పోతున్నాయని, రైతులు ప్రత్యామ్నాయ పంటల దిశగా ఆలోచన చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగును వరికి ప్రత్యామ్నాయంగా ప్రోత్సహిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగు లాభాలపై వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారని, అదే సమయంలో రైతులకు నమ్మకం కలిగించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసే రైతులతో నేరుగా మాట్లాడేందుకు కొంతమంది రైతులను ఎంపిక చేసి క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకెళుతున్నామని అన్నారు. అనంతరం రైతుల బృందంతో వెళుతున్న బస్సుకు ఒక రైతుతో కలిసి కలెక్టర్ పచ్చ జెండా ఊపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, నాబార్డు ఏజీఎం జయప్రకాశ్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సర్వే

- ఇందిరమ్మ కాలనీలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ పర్యటన



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్, ఫిబ్రవరి 6 : రామగుండం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై సర్వే నిర్వహించాలని తహసిల్దార్‌ను అడిషనల్ కలెక్టర్ జె.అరుణశ్రీ ఆదేశించారు. మంగళవారం ఇందిరమ్మ కాలనీ, జంగాలపల్లి, గంగానగర్ పరిధిలో ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకున్న ప్రాంతాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ భూములలో ఇటీవల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పేదలు ఇళ్లు కట్టుకున్న క్రమంలో రామగుండం తహసీల్దార్ ఆధ్వర్యంలో సర్వే చేసి, ఆక్రమితదారుల వివరాలు సేకరించాలని ఆదేశించారు.

స్ట్రీట్ వెండర్లకు షాపుల కేటాయింపు..

ఎన్టీపీసీ-ఆర్ఎఫ్‌సీఎల్ రహదారిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన స్ట్రీట్‌వెండర్ షాపులను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ ఆదేశించారు. మంగళవారం స్ట్రీట్ వెండర్ దుకాణ సముదాయాన్ని ఆమె పరిశీలించారు. స్ట్రీట్ వెండర్ల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఇక్కడ నిర్మించిన ఉన్న షాపులను డ్రా పద్ధతిలో కేటాయించాలని ఆమె సూచించారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, మెప్మా, ఇతర అధికారులున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

- సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 6: సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత యువతపై ఉందని రామగుండం సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్ వినియోగం పెరిగిపోయిన దృష్ట్యా సైబర్‌నేరస్థులు మోసాలకు పాల్పడుతున్నారని వాటిని అరికట్టాలంటే అవగాహన ఒక్కటే మార్గమన్నారు. తక్కువ సమయంలో త్వరగా డబ్బు సంపాదించేందుకు షార్ట్‌కట్ మార్గాలను యువత వెతకవద్దన్నారు. సరైన మార్గంలో నడుస్తూ మంచిస్థాయికి ఎదగాలన్నారు. సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో, వాటిని ఎలా అరికట్టాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఖాజాజహీర్‌అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సైబర్‌క్రైమ్ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'బిరుదు'కు కన్నీటి వీడ్కోలు



బిరుదు రాజమల్లు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు విజయరమణారావు, వివేక్ వెంకటస్వామి, శాసనమండలి చీఫ్ విప్ భానుప్రసాదరావు, డీసీపీ చేతన

సుల్తానాబాద్, ఫిబ్రవరి 6 : పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు భౌతిక కాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. సోమవారం హైదరా బాద్‌లో అనారోగ్య సమస్యతో మృతిచెందిన బిరుదు రాజమల్లు పార్థివదేహాన్ని అదే రోజు మధ్యాహ్నం సుల్తానాబాద్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. మంగళవారం ఉదయం చే పట్టిన అంతిమ యాత్రలో పెద్దఎత్తున అభిమానులు పార్టీ లకతీతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. పార్థివదేహం సుల్తానాబాద్‌కు చేరినప్పటి నుంచి అంతిమయాత్ర వరకు ఎమ్మెల్యే విజయరమణారావు దగ్గరుండి అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, శాసనమండలిలో చీఫ్ విప్ భానుప్రసాదరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, చెన్నూరు ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి, ఆర్టీసీ ఎండీ సజ్జన్నార్, పెద్దపల్లి డీసీపీ చేతన, ఎంప బారీ తదితర పోలీస్ ఉన్నతా ధికారులు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, కోరు కంటి చందర్, సోమారపు సత్యనారాయణ, గుజ్జుల రామక్రిష్టారెడ్డి, రఘువీర్‌సింగ్, మాజీ ఎంపీ సుగుణ కుమారి, టీ ఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ రాకేష్, నల్లమనో హర్‌రెడ్డి, సీపీఐ నేత కలవేని శంకర్, గడ్డం వంశీ, తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, రాజమల్లుకు నివాళులర్పించారు. అభిమానులు, ప్రజల అశ్రునయనాల మధ్య బిరుదు రాజమల్లు అంతిమ సంస్కారాలు కొనసాగాయి.

కాగా, రాజమల్లు మృతికి సంతాపం వ్యక్తంచేస్తూ సుల్తానాబాద్ పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.

నూతనచట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

మంథనిరూరల్, ఫిబ్రవరి 6: జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు కొత్త చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పుట్టపాక గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులతో మంథని ఆర్డీవో హనుమా నాయక్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవార్డు విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు ఆర్డీవోతో మాట్లాడుతూ.. తమకు కొత్త చట్టం ప్రకారం ఎకరానికి రూ.18 లక్షలు, అర ఎకరం, ఎకరం కోల్పోతున్న రైతులకు పరిహారంతో పాటు భూమిని ఇప్పించాలని, ఆస్తులు కోల్పోతున్న వారికి సరైన పరిహారం అందించాలని కోరారు. రైతుల డిమాండ్లను లిఖిత పూర్వకంగా అందజేయాలని ఆర్డీవో సూచించారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజిరెడ్డి, స్పెషల్‌ఆఫీసర్ అనిల్, మాజీ సర్పంచ్‌లు రొడ్డ మమత-శ్రీనివాస్, ఐలి శ్రీనివాస్, ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, భూనిర్వాసితులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 6 : మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఈనెల 15 వరకు గడువు పొడిగించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలపై ఇతర వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి, పాఠశాలల లేదా కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గృహజ్యోతి వివరాల నమోదుకు వచ్చే సిబ్బందికి సహకరించాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు వివరాల నమోదు చేసుకొనేందుకు వచ్చే విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ బొంకూరి సుందర్శనం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 15వ తేదీ వరకు తమ ఇళ్ల వద్దకు వచ్చే విద్యుత్ సిబ్బందికి ఇంటి నంబర్, ఆధార్, రేషన్ కార్డు వివరాలు, ఫోన్ నంబర్ చేసుకోనున్నారని తెలిపారు. ఇళ్లల్లో అద్దెకు ఉండే వారి వివరాలను కూడా నమోదు చేసుకునేందుకు సహకరించాలని కోరారు. తెలంగాణలో ఎక్కడ ఆధార్ నమోదైనా ఫరవా లేదని పేర్కొన్నారు. పాత బకాయిలన్నింటిని తప్పనిసరిగా చెల్లించాలన్నారు. ఈనెల 15వ తేదీ వరకు నమోదు చేసుకుంటారని, ఇళ్లల్లో అందుబాటులో లేని వాళ్లు పక్కింటి వారికి వివరాలు ఇచ్చి వెళ్లాలని, లేదంటే ఏఈ కార్యాలయాలకు వచ్చి నమోదు చేసుకోవాలని ఎస్‌ఈ కోరారు.



ఏఐసీసీ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు మూడు టిక్కెట్లు ఇవ్వాలి

పెద్దపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మూడు స్థానాలను మాదిగలకే పార్టీ టిక్కెట్లు కేటాయించాలని కోరుతూ మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో మాదిగ జేఏసీ అధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో మాదిగల జనాభా దామాషా ప్రకారం రెండు ఎస్సీ స్థానాలు, ఒకటి జనరల్ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని మాదిగ జేఏసీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో వివిధ మాదిగ ఉద్యమ సంస్థలను కలుపుకొని ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం సమర్పించామని మాదిగ శక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లెపల్లి రవి, ఈదునూరి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం

- కుంటి సాకులతో దాటవేసే ప్రయత్నం - మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కొప్పుల ఈశ్వర్

జ్యోతినగర్, ఫిబ్రవరి 6 : అమలుకు సాధ్యంకాని వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్, పార్లమెంటు ఎన్నికల సాకుచెప్పి హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంగళవారం ఎన్టీపీసీలోని లక్ష్మీనర్సింహ గార్డెన్స్‌లో జరిగిన బీఆర్ఎస్ రావగుండం నియోజకవర్గం కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కొప్పుల ఈశ్వర్ ప్రసంగించారు. 6 గ్యారెంటీలు, 420 హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం రెండు నెలల్లోనే బయట పడిందన్నారు. హామీలను నెరవేర్చ లేక కుంటి సాకులతో దాటవేసే ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తేనే గ్యారంటీలను అమలు చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి అనడం వాగ్దానాలను తుంగలో తొక్కడమే అన్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ఘనీయమైన అభివృద్ధి సాధించిందని, దేశంలోనే నంబర్ రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేసి ప్రజలను మభ్యపెట్టారని, తమ హయాంలో అప్పుల విషయం మాట్లాడుతున్న కాంగ్రెస్ తాము సృష్టించిన ఆస్తుల విషయాన్ని చెప్పడం లేదన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు, తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంలో విఫలమైనందు వల్లనే ఓడిపోయామన్నారు. గత ఎన్నికలను గుణపాఠంగా తీసుకొని జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుందామన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కొరత నివారణకు చర్యలు : డీపీవో

ఓదెల, ఫిబ్రవరి 6 : గ్రామాల్లో ఇప్పటినుంచి ప్రతి ఇంటింటికి నల్లాల ద్వారా త్రాగునీటి సరఫరా చేయించి, నివారణ చర్యలు చేపట్టాలని డిపిఓ చంద్రమౌళి కార్యదర్శిలను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రానున్న వేసవిలో తాగునీటి నివారణ, గ్రామాల్లో పారిశుధ్యం, బిల్లుల చెల్లింపులపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపివో మాట్లాడుతూ తీర్మానాలు రాసేముందు చేయవలసిన, చేయకూడని పనులను సూచించారు. అలాగే ఎంబి రికార్డుల విధానాలు, రికార్డు చేయడంలో జాప్యం ఉండకూడదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుకాదేవి, ఎంపీడీవో సత్తయ్యతహసిల్దార్ యాకయ్య, ఎంపీఓ వాజీద్, ఏఈలు సమ్మిరెడ్డి, రాజేష్ కుమార్, స్రవంతి, పశువైద్యాధికారి కుమారస్వామి అలాగే 22 గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● 135 గ్రాముల బంగారం, నగదు స్వాధీనం

పెద్దపల్లిటౌన్, జనవరి 6: జల్సాలకు అలవాటుపడి సులవుగా డబ్బులు సంపాదించాలనే ఇద్దరు దొంగల ముఠాను మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందవర్భంగా ఏసీపీ ఎడ్ల మహేష్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కుకుతుబుల్లాపూర్, భగత్ నగర్‌కు చెందిన మనిగండ్ల విజయ్‌కుమార్, భూపాల్‌పల్లి జిల్లా మొట్లపల్లికి చెందిన మిర్యాల రాజులు గతంలో దొంగతనాలకు పాల్పడి జైలు జీవితంలో పరిచమయ్యారు. వీరిద్దరూ జనవరి 31న పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తమ వెంట తెచ్చుకున్న రించ్ స్పానర్‌తో ఓ ఇంటి తాళం పగులగొట్టి చొరబడగా ఆ ఇంటిలో ఖరీదైన వస్తువులు దొకకపోవడంతో పక్కనే ఉన్న ఎరవెల్లి వెణుగోపాల్‌రావు ఇంటి తాళం పగుల గొట్టి బంగారు, వెండి అభరణాలు దొరికినకాడికి దోచుకొని పారిపోయారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ఆచూకీ సేకరించారు. మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టారు. చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్న దొంగల నుంచి 135 గ్రాముల బంగారం, లక్షా 40 వేల రూపాయల నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్, బంగారు అభరణాల లోన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ఆర్ కృష్ణ, పెద్దపల్లి, ధార్మరం, బసంత్ నగర్ ఎస్సైలు మల్లేష్, సత్యనారాయణ, వెంకటేష్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

నాలుగు ఇళ్లలో చోరీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 6: తంగళ్లపల్లి మండలంలో నాలుగిళ్లల్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం..గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి రూ. 1.50 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం, కిలో వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని తంగళ్లపల్లికి చెందిన కడమంచి లింగమూర్తి ఇంటి తాళం పగులగోట్టి 40 వేల నగదు, నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే మ్యాకల గంగారాం ఇంటి తాళాలు పగులగోట్టి బీరువాలో ఉన్న రూ. 60వేల నగదును దోచుకున్నారు. పక్కనే ఉన్నా మ్యాకల నర్సయ్య ఇంటి తాళాన్ని పగులగొట్టి వస్తువులను చిందర వందరగా చేశారు. అలాగే పద్మనగర్‌కు చెందిన పురోహితుడు పారునంది అంజనేయ శర్మ దంపతులు ఇంటికి తాళం వేసి ఊరువెళ్లగా తాళాలు పగులగొట్టిన దొంగలు రూ 50 వేల నగదు, తులం బంగారంతో పాటు కిలో వెండి అభరణాలను అపహరించినట్లు తెలిపారు. 48 గంటల్లో ఓబులాపూర్ గ్రామంతో పాటు తంగళ్లపల్లి, పద్మనగర్‌లలో ఏడు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగల అచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లను సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ ప్రశాంత్‌లు పరిశీలించారు.

మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 6: మహాశివరాత్రి జాతర కోసం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జాతర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని దిశానిర్దేశం చేశారు. శివ స్వాములకు సులభ దర్శనం జరిగే విధంగా చూడాలని, దర్శన సమయం కూడా అరగంట అదనంగా పెంచాలన్నారు. పుర ప్రముఖులకు గతంలో మాదిరి బ్యాడ్జీలు అందజేసి సులభ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం భక్తుల కోసం రెండు క్యూలైన్‌ల సిస్టం ఉన్న దృష్ట్యా వీఐపీల కోసం మూడో క్యూలైన్ శివరాత్రి లోగా ఏర్పాటు చేయాలని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు తాగునీరు, కుర్చీలు, పందిల్ల సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పారిశుధ్య సిబ్బందిని నియమించాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు శాశ్వత సీసీ కెమెరాలను పెట్టాలన్నారు. జాతర విజయవంతం చేయాలని కోరారు.


ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ ఆదిశ్రీనివాస్

అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జాతర సమన్వయ కమిటీ చైర్మన్ అనురాగ్ జయంతి సూచించారు. భక్తులు స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు.

జాతరకు భారీ బందోబస్తు : ఎస్పీ అఖిల్ మహాజన్

మహా శివరాత్రి జాతర సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్, టోయింగ్ వాహనం, క్రేన్ అందుబాటులో ఉంచాలని ఆలయ ఈవోకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వలంటీర్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

వీఐపీ క్యూలైన్ కోసం ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో వీఐపీ క్యూలైన్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో మూడో క్యూలైన్ ఉపయోగించడం వల్ల సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా లభించే అవకాశం ఉందని, ఇదే క్యూలైన్‌ను వీఐపీల బ్రేక్ దర్శనం కోసం నిర్దీత సమయాల్లో ఉపయోగించవచ్చని ఆది శ్రీనివాస్ సూచించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులకు వారు సూచించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గంగాధర, ఫిబ్రవరి 6: మాయమాటలు చెప్పి ప్రయాణికురాలి రెండు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించిన నిందితులను పట్టుకున్నట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు లక్ష్మి(60) గంగాధర మండలం గర్షకుర్తిలోని కూతురు ఇంటికి కొడిమ్యాల మండలం జేఎన్‌టీయూ రోడ్డు వద్ద ఆటో ఎక్కి వస్తుండగా ఆటో డ్రైవర్ రాజు, అతని భార్య పద్మావతి మాయమాటలతో పుస్తెలతాడు దొంగిలించినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 48 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన గంగాధర ఎస్ఐ అభిలాష్, సిబ్బందిని అభినందించారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు తెలిపారు.

ఆటో కిందపడి చిన్నారి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: కొత్తపల్లి మండలం చింతకుంటలో మంగళవారం ఉదయం ఒక ఆటో కిందపడి 16 నెలల చిన్నారి మృతి చెందిందని కొత్తపల్లి ఏఎస్ఐ మొగిలి పోచయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన వేముల నూతనశ్రీ అనే చిన్నారిపై నుంచి ఆటో టైర్ ఎక్కటంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఇంటర్‌నెట్ కేబుల్ లైన్ తవ్వేందుకు వచ్చిన కూలీలు చింతకుంటలో పనిచేస్తున్నారు. నీటిని సరఫరా చేస్తున్న అంజయ్యకు తన ఆటోను రివర్స్ తీస్తుండగా అక్కడే నూతనశ్రీ తన తల్లితో కలిసి ఉంది. ప్రమాదవశాత్తుగా ఆటోను చిన్నారిపై నుంచి తీయటంతో దుర్మరణం చెందిందని తెలిపారు. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదుతో చింతకుంటకు చెందిన ఆటో డ్రైవర్ అంజయ్యపై ఫిర్యాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ మొగిలి పోచయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టుకు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నవేని(బండల్ల) అజయ్(18)అనే యువకుడు మంగళవారం తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కొందరు గమనించి 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అజయ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాజన్న క్షేత్రంలో తిరుమల తరహా వీఐపీ బ్రేక్

● ఉదయం, సాయంత్రం గంట చొప్పున దర్శనం

వేములవాడ, ఫిబ్రవరి 6: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమలు చేస్తున్న తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మహాశివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. వీఐపీల రాక కారణంగా సామాన్య భక్తులకు దర్శనం నిలిపివేయడం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి టీటీడీ తరహాలో వీఐపీ బ్రేక్ దర్శన విధానాన్ని ప్రవేశ పెట్టాలని ఆలయ అధికారులకు సూచించారు. ఉదయం వేళలో ఒక గంట, సాయంత్రం వేళలో ఒక గంట సమయం వీఐపీ బ్రేక్ దర్శనం కోసం కేటాయించాలని, ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసి వీలైతే శివరాత్రి జాతరలోగానే ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం కోసం ప్రత్యేక సమయం కేటాయించడం వల్ల సాధారణ భక్తులకు దర్శన ఇబ్బందులను దూరం చేయవచ్చని ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 6: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

సమ్మక్క భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం


ఆలయం వద్ద భక్తుల రద్దీ


కొండపైన భక్తుల వాహనాలు

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా తరలి వచ్చిన సమ్మక్క, సారక్క భక్తులతో జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్క, సారక్క జాతర నేపథ్యంలో కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కొండగట్టుకు తరలి వస్తున్నారు. దాదాపుగా యాభై వేలకు వరకు భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకు వజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో వైరా గ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, పోలీసులు ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహ నాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

● సీపీ కఠిన చర్యలతో కబ్జాదారుల్లో భయం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: భూకబ్జా కేసులో మంగళవారం కరీంనగర్ పోలీసులు మాజీ ఆర్టీఏ మెంబర్ తోట శ్రీపతిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ శివారులోని వివేకానందపురి కాలనీకి చెందిన అనుమాండ్ల రవీందర్ 2014 మేలో తీగలగుట్టపల్లి రోడ్ నెంబరు 16 కార్తికేయనగర్‌లో 144 చదరపు గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి బేస్‌మెట్ నిర్మించుకుని 2023లో ఒక బోర్‌వెల్ కూడా వేసుకున్నాడు. ఇటీవలనే ఇంటి నిర్మాణం చేపడుతుండగా జనవరి 10న రాత్రి 10:30 గంటలకు పది మందికిపైగా అక్రమంగా చొరబడి 8 పిల్లర్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేశారని బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ జరిపి ఈ ఘటనతో ప్రమేయం ఉన్న కరీంనగర్ చైతన్యపురి కాలనీకి చెందిన తోట శ్రీపతిరావు(50), పొన్నాల కనకయ్య, పవన్, సిరిపురం వెంకటరాజు, మరి కొందరిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదైన విషయం తెలుసుకున్న శ్రీపతిరావు పరారీలో ఉండగా అతని గాలింపుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసి వెదుకుతుండగా సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ అంబర్‌పేట్‌లో అతని సోదరుడి ఇంటిలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం కరీంనగర్‌కు తీసుకువచ్చి విచారణ అనంతరం సాయంత్రం శ్రీపతిరావును కరీంనగర్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. శ్రీపతిరావుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేయగా పోలీసులు జైలుకు తరలించారు.

● భూకబ్జాలు, దౌర్జన్యాలు, డబ్బులు డిమాండ్, వేధింపులకు సంబంధించి బాధితుల ఫిర్యాదులతో నిందితులపై వరుసగా కేసులు నమోదు చేస్తూ, అరెస్టు చేసి జైలుకు తరలిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజులుగా భూకబ్జాలు, మోసాలపై పోలీస్ కమిషనర్ దర్బార్‌ను నిర్వహిస్తుండగా ఇప్పటి వరకు 660 మంది బాధితుల నుంచి సీపీకి ఫిర్యాదులు అందాయి.

కేసుల భయంతో 8 ప్లాట్లు అప్పగింత

ఇటీవల పోలీస్ కమిషనర్ భూకబ్జాలపై ఉక్కుపాదం మోపి కేసులు, అరెస్టులు చేస్తుండటంతో భయపడి కరీంనగర్ మూడో ఠాణా పరిధిలోని ఒక ప్రజాప్రతినిధి గతంలో కబ్జా చేసిన స్థలాలను బాధితులను పిలిపించుకుని తిరిగి వారికి అప్పగించనట్లు తెలిసింది. అప్పటి అధికారపార్టీకి చెందిన సదరు ప్రజాప్రతినిధి భూ వివాదంలో తలదూర్చి న్యాయం చేస్తానని చెప్పి చివరకు ఆ స్థలంలో ప్రహరీగోడను నిర్మించి తన ఆధీనంలో పెట్టుకున్నాడని, ఆ తరువాత ఇంటినెంబర్లు వేసి, షెడ్ కూడా నిర్మించినట్లు తెలిసింది. బాధితులు సీపీని ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకుని బాధితులను పిలిపించుకుని వారి స్థలాలను వారికే అప్పగించినట్లు సమాచారం. దీనిపై కూడా స్పెషల్‌టీం పోలీసులు ఆరాతీస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతుండటంతో ఆయా పరిధిలోని పోలీసు ఠాణాల ఎస్‌హెచ్‌ఓలకు అప్పగించి విచారణ జరపాలని సీపీ ఆదేశిస్తున్నారు. భూకబ్జాలు, డబ్బులు మోసాలకు సంబంధించి పెద్ద తలకాయల పాత్ర ఉన్న కేసులను నేరుగా సీపీ మానిటరింగ్ చేస్తూ దర్యాప్తు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ కేసుల దర్యాప్తును పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 6: మండలంలోని అనంతగిరి గ్రామంలో కుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం మంగళవారం ఇంటి బయట ఆడుకుంటున్న పబ్బతి మనోజ్ఞ, పబ్బతి ప్రసన్న, జుట్టు బాలయ్యలను కుక్క కరిచింది. చికిత్స నిమిత్త వీరిని ఆస్పత్రికి తరలించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 6: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలీండర్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను క్యాబినెట్ మంత్రి వర్గం ఆమోదించడంపై మంగళవారం గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేటర్లు కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని‌ప్రకాష్, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, పాతిపెల్లి రవి, బొమ్మక శైలజ, దాసరి సాంబమూర్తి, ఫజల్‌బేగ్, మల్లికార్జున్, సుతారి లక్ష్మణ్‌బాబు, కొప్పుల శంకర్, కళ్యాణి సింహాచలం, గడ్డం శేఖర్, ఆడెపు రవి, దూళికట్ట సతీష్, బెంద్రం రాజిరెడ్డి, నజిమోద్దీన్, దాసరి విజయ్, కౌటం సతీష్, రాజ్‌కుమార్, ప్రవీణ్, రజిత, శోభ, జ్యోతి, కనకలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

జ్యోతినగర్, ఫిబ్రవరి 6 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళాలు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని కాపులపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించనున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మాజీ సర్పంచ్ గోపు కవిత-శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించగా మంగళవారం రూ.2,52,355లను దాతలు అందించినట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక అధికారుల నియామకంలో మార్పులు

ధర్మారం, ఫిబ్రవరి 6: ధర్మారం మండలంలో 29గ్రామ పంచాయతీలకు పది మంది ప్రత్యేక అధికారులను నియమించారు. సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిన తర్వాత గ్రామానికి ఒక్కరి చొప్పున ప్రత్యేక అధికారులను నియమించగా మంగళవారం నియమాకల్లో మార్పులు చేస్తు 29గ్రామాలకు పది మంది ప్రత్యేక అధికారులను నియమించారు. బంజేరుపల్లి, గోపాల్‌రావుపేట, కొత్తపల్లిన్యూ, కొత్తూర్‌లకు ఎంపీడీవో బీ జయశీల, మల్లాపూర్, నందిమేడారం, సాయంపేటకు తహసీల్దార్ ఏ.రజిత, కానంపల్లి, దొంగతుర్తి, పెర్కపల్లి గ్రామాలకు పంచాయతీ అధికారి రమేష్, నర్సింగాపూర్, నాయకంపల్లిలకు ఎంఈవో చాయాదేవి., బొమ్మారెడ్డిపల్లి. ఖిలావనపర్తి, ఎర్రగుంటపల్లిలకు పశువైద్యాధికారి అజయ్‌కుమార్, రచ్చపల్లి, రామయ్యపల్లి గ్రామాలకు డిప్యూటి తహసీల్దార్ మల్లారెడ్డిలను గ్రామ ప్రత్యేక అధికారులుగా నియమించారు. బొట్లవనపర్తి, బుచ్చయ్యపల్లి, నర్సింహులపల్లి గ్రామాలకు వ్యవసాయ అధికారి పూర్ణిమ, కటికెనపల్లి, లంబాడితండ(బి), మైడిచింతలపల్లి, లంబాడితండ(కె) పీఆర్ ఏఈ రాజశేఖర్, చామనపల్లి, కొత్తపల్లి, పత్తిపాక గ్రామాలకు పశువైద్యాధికారి కిషోర్, ధర్మారం, కమ్మరిఖాన్‌పేట గ్రామప్రత్యేక అధికారిగా పీఆర్ డీఈ శంకరయ్యలను నియమించారు. వీరంతా మంగళవారం ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 6 : పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంపీవో సుదర్శన్ అన్నారు. మండలంలోని రంగాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఏ విధంగా చదువుపై శ్రద్ధ చూపించాలో విద్యార్థులకు ఎంపీవో వివరించారు. వెంట ఎంఈవో సురేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 6: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు కందుల సతీష్ రామగుండం శాసన సభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.

యువజన, క్రీడా సంఘాలు లెటర్‌హెడ్స్ సమర్పించాలి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 6 : జిల్లాలోని రిజిస్టర్డ్ యువజన సంఘాలు, క్రీడా సంఘాలు తమ వివరాలను తెలుపుతూ లెటర్ హెడ్‌లను ఈనెల11లోగా అందజేయాలని జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఏ.సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ఓటమిపాలైనా బాల్క సుమన్‌కు బుద్ధి రాలేదు'

పాలకుర్తి,ఫిబ్రవరి 6: ఎన్నికల్లో ప్రజలు ఓడించినా చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు బుద్ధి రాలేదని మండల దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాలకుర్తి ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీవ్ర పరుష పదజాలంతో దూషించి, వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సమావేశంలో దుర్గం కుమార్, తుంగ నర్సయ్య, వేల్పుల రాజ్‌కుమార్ తదితరులున్నారు. అంతకు ముందు తొగరి తిరుపతి అధ్యక్షతన బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బాల్క సుమన్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బసంత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మేకల గంగమ్మ, లక్ష్మణ్ రావు, నేరెల్ల సత్యం తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

పాలకుర్తి, ఫిబ్రవరి 6 : మండలం పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన ఒడ్నాల ప్రభాకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం బంధువులు, తోటి డిప్పర్ లారీ డ్రైవర్లు, గ్రామస్తులు కలిసి 70 వేల రూపాయలను జమచేసి మృతుడి భార్య లావణ్య, కూతూరు అక్షిత పేర పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్ చేసి బాండ్ పత్రాలను అందించారు.

అవార్డు అందుకున్న విద్యార్థికి అభినందన

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 6: ఇటీవల గోదావరిఖనిలో బిట్‌బిట్ డ్యాన్స్ అకాడమీ, దేవ కళా బృందం ఆధ్వర్యంలో జరిగిన నృత్య కార్యక్రమంలో బాలనృత్య అవార్డు అందుకున్న సెక్రెడ్ హార్ట్ హైస్కూల్ విద్యార్థి, ఎన్‌సీసీ కేడేట్ కుంట విద్యాలయను మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. ప్రిన్సిపల్, కరస్పాండెంట్ లౌవ్‌లీ జాకబ్, ప్రిన్సిపాల్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌చార్జీ ఇన్నమ్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్స్న, సర్వేష్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

జాకబ్ సేవలు చిరస్మరణీయం

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 6: కళాకారుడు జాకబ్ సేవలు మరువలేనివని ఏఐటీయూసీ ఉపప్రధానకార్యదర్శి మడ్డి ఎల్లయ్య, కవ్వంపెల్లి స్వామి అన్నారు. జాకబ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజాసంఘాల నాయకులు జాకబ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరెల్లి పోషం, కనకరాజు, వేల్పుల నారాయణ, ఓదమ్మ, రాజమౌళి, గౌస్, పాత్రికేయులు వంశీ, మ్యాజిక్ రాజా, రజబ్ అలీ పాల్గొన్నారు.

మేడారం జాతర ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలం

- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్

మంథని, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మావోయిస్టు పార్టీ జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ ఆరోపించారు. ఈ మేరకు మావోయిస్టు నేత వెంకటేష్ పేరిట మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీలు పండుగను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుని వారి పాత్రను నామమాత్రం చేసిందని పేర్కొన్నారు. జాతర నిధులను దారి మళ్లించి స్థానిక ఆదివాసీలకు నిర్లక్ష్యం చేసిందని, జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయన్నారు. మౌళిక సదుపాయాలు కల్పించకపోవడం, పారిశుధ్య పనులు, మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతోపాటు ఏ పని పూర్తికాకపోవడంతో జాతరకు వచ్చిన ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి పనులను వేగవంతం చేసి భక్తులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలన్నారు. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలతోనే చేయాలని, హిందూ సంప్రదాయాలైన లడ్డు, పులిహోర లాంటివి కాకుండా బెల్లం ప్రసాదంగా ఇవ్వాలని, జాతర తర్వాత ఆ ప్రాంతంలో జబ్బులు రాకుండా శుభ్రం చేయాలని వెంకటేష్ డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలపై నిరసనలు



ఖనిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక ప్రధానచౌరస్తాలో బాల్క సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్, మెంటం ఉదయ్‌రాజ్, పాతపెల్లి రవి, మల్లికార్జున్, బొమ్మక శైలజ రాజేష్, కల్యాణి సింహాచలం, గడ్డం శేఖర్, ఆడెపు రవి, రహీం, మాలెం మధు, దుర్గాప్రసాద్, సుమంత్, శ్రీమాన్, సాగర్, సుతారి లక్ష్మణ్, కౌటం సతీష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కోల్‌సిటీ, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేయాలని ఎన్ఎస్‌యూఐ నగర అధ్యక్షుడు దాసరి విజయ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుడికందుల రవి, నరేళ్ల రమేష్, జన్ను మహేష్, నంది వెంకటేష్, శ్రీకాంత్ యాదవ్, రాహుల్ పాల్గొన్నారు.

ధర్మారం, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను మంగళవారం ధర్మారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. జిల్లాకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బొల్లి స్వామి, కొత్త నర్సింహం, దేవి జనార్ధన్, కాంపెల్లి రాజేశం, ఓరెం చిరంజీవి, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కాడె సూర్యానారాయణ, ఒడ్నాల శంకరయ్య, దేవి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో మంగళవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కొరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, నరహరి సుధాకర్‌రెడ్డి, అమ్ముల శ్రీనివాస్, రమేష్, రాయమల్లు, రాజు, తిరుమల్‌రెడ్డి, సింగిరెడ్డి చంద్రరెడ్డి, కోట శ్రీకాంత్, వెంకటేశ్వర్‌రావు, దేవరాజ్, వెంకటేష్ అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కమాన్ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల సత్యనారాయణరెడ్డి, పలువురు దళిత సంఘాల నాయకలు, దళితులు పాల్గొన్నారు.



ధర్మారంలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ చేతన

భరోసా కేంద్రం ప్రారంభం

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 6: లైంగిక దాడు లకు గురైన మహిళలు, బాలబాలికలకు రక్షణ కోసం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని మంగళవారం డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీపీలు షికా గోయ ల్, మహేష్ భగత్‌తో కలికి వర్చువల్ ద్వారా ప్రారంభించారు. అనంతరం పెద్దపల్లి జోన్ డాక్టర్ డీసీపీ చేతన పోలీసు అధికా రులతో కలిసి శిలాఫలాకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, గోదావరిఖని ఏసీపీ తుల శ్రీనివాస్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, భరోసా కేంద్రం సిబ్బందితోపాటు పోలీ స్ సిబ్బంది పాల్గొన్నారు.

16న జరిగే సమ్మెను విజయవంతం చేయాలి

జ్యోతినగర్, ఫిబ్రవరి 6 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను ఈ ప్రాంత కార్మిక వర్గం విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి లుక శంకర్, మెరుగు చంద్రయ్య కోరారు.మంగళవారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన ముఖ్య నేతల సమావేశంలో సమ్మె విజయవంతంపై చర్చించారు. ఈనెల 11న కోల్‌బెల్ట్‌లో భారీబైక్ ర్యాలీని చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో ఆర్.రాయమల్లు,నర్సయ్య, భూమయ్య, మధు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల..

ఈనెల 16జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి మంగళవారం ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎన్టీపీసీ ప్లాంటు 2వ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాంసాని శంకర్, రాఘవరెడ్డి(సీఐటీయూ), చిలుక శంకర్, బుచ్చన్న(ఐఎఫ్‌టియు), ఇ.భూమయ్య(బీఆర్ఎస్)శ్రీనివాస్, రాజమల్లయ్య, నాగభూషణం, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 6: ఈనెల 16న జరిగే సమ్మెను గ్రామపంచాయతీ కార్మికుల విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు కోరారు. సమ్మె పోస్టర్లను మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. సీఐటీయూ మండల నాయకులు దొడ్ల రాజబాబు, కలవేని గట్టయ్య, ఎండీ గౌసుద్దీన్, చల్ల రాజయ్య, అంబాల లక్ష్మణ్, అంజయ్య, చెప్యాల మహేష్, అర్థం రాజు, రాజయ్య, బొల్లి సమ్మయ్య, సంఘాని తిరుపతి పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 6 : కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కి బడ్జెట్ పెంచటంతో పాటు ఐసీడీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్ సమ్మెలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. జ్యోతి, నాయకులు టీ.కృష్ణకుమారి, మల్యాల భాగ్య, జయసుధ, సరోజన, కుమారి, విశాలక్ష్మీ, అమృత పాల్గొన్నారు.

అంతర్గాం, ఫిబ్రవరి 6: ఈనెల 16న తలపెట్టిన భారత్ బంద్ విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ(చంద్రన్నవర్గం) నాయకులు లగిశెట్టి భీమయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ పెట్టుబడి వర్గాలకు కొమ్ముకాస్తూ రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కొల్లూరి మల్లేష్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకలు పెండ్యాల రమేష్, కట్టె తేజేశ్వర్ పాల్గొన్నారు.

సమ్మక్క జాతర నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 6: గోదావరిఖని గోదావరిఖని వంతెన వద్ద ఈనెల 21నుంచి 24వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణపై ఎండోమెంట్, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, అయోధ్య రవీందర్ ఆరోపించారు. మంగళవారం జాతర వద్ద, పరిసర ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మున్సిపల్, ఎండోమెంట్ అధికారులకు టెండర్ల మీద ఉన్న ఆసక్తి జాతర ఏర్పాట్లపై లేదని, అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికీ మహిళలకు స్నానాల గదులు, బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు, మరుగుదొడ్ల పనులు చేపట్టలేదని, గతంలో మున్సిపల్ కార్పొరేషన్ వేసిన చెత్తపై ఒక లేయర్ మాత్రమే మట్టి పోయడం వల్ల చెత్త పైకి లేస్తుందని, గోదావరి పరివాహక ప్రాంతాన్ని ఇప్పటివరకు శుభ్రం చేయలేదన్నారు. దీని కోసం శాశ్వత పరిష్కారం చూపాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తోట కుమారస్వామి, కందుల పోషం, బరుపటి నారాయణ, సుమన్, పైతరి రాజు, అజయ్, బాలు, మహేందర్, వినయ్, సంపత్ పాల్గొన్నారు.



వకీల్‌పల్లె గని సమస్యలు పరిష్కరించండి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 6: వకీలపల్లె గనిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఐఎన్‌టీయూసీ నాయకులు గని మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వైస్‌ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, ఎట్టెం కృష్ణ, ఉమేష్, సాదుల సంతోష్, మల్లికార్జున్, జగదీష్, జాన్, సంపత్‌రెడ్డి, బాబూరావు ఉన్నారు.

సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 6: ప్రాజెక్టుకు కేటాయించిన బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత లక్ష్యాలను సమష్టి కృషితో సాధించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ఉద్యోగులకు సూచించారు. మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఓసీపీ-1 సైటాఫీస్‌లో ఆయన మాట్లాడారు. లక్ష్యాన్ని సాధించే క్రమంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, అంకితభావం, సమష్టి కృషితో విధులు నిర్వహించాలని సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంస్థ నిర్దేశించుకున్న 77మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించేలా ఉద్యోగులు కృషి చేయాలని జీఎం సూచించారు. ఈసందర్భంగా సంస్థ సాధిస్తున్న ప్రగతి, బొగ్గు లక్ష్యాలను సాధించడానికి అనుసరిస్తున్న ప్రణాళికల గురించి అధికారులు పీపీటీ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. వివిధ అంశాలపై ఉద్యోగుల నుంచి సూచనలు, సలహాలను అధికారులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ ఎలీషా, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, ఎస్వోటూ జీఎం రఘుపతి, అధికారులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ఉదయ్‌హరిజన్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల ప్రతినిధులు డీటీ రావు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో...

ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్‌లో ఆర్జీ-2 యాజమాన్యం మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో 2023-24 వార్షిక సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత మరియు బొగ్గు రవాణా, భూగర్భ గనులు, ఓసీపీల్లో భారీ యంత్రాల వినియోగం, సంస్థలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలను సాధించేందుకు పాటిస్తున్న పద్ధతులను మల్టీడిపార్ట్‌మెంట్ టీం సభ్యులు ఉద్యోగులకు వివరించారు. ఉద్యోగుల నుంచి సూచనలు స్వీకరించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, మల్టీడిపార్ట్‌మెంట్ సభ్యులు ఎస్వోటూ జీఎం బచ్చ రవీందర్, డీజీఎంలు రాజేంద్రప్రసాద్ (పర్సనల్), మురళీకృష్ణ(ఐఈ), ఎర్రన్న(వర్క్‌షాప్), ఎస్ఈ రాంరెడ్డి, పిట్ సెక్రెటరీ నారాయణతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఓసీపీ-1 ఉద్యోగులతో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

'దళిత బంధు పథకాన్ని కొనసాగించాలి'

మంథని, ఫిబ్రవరి 6: దళిత బంధు పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మంథని నియోజకవర్గ జైభీమ్ దళిత బంధు సాధన కమిటీ అధ్యక్షుడ ఊట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పోనగంటి రాజనర్స్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ గవర్నమెంట్ దళిత బంధు స్కీమును యథావిధిగా కొనసాగించి దళిత కుటుంబాల అభ్యున్నతికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డివిజన్ కోశాధికారి గద్దల శంకర్, డివిజన్ కార్యదర్శి కాదశి తిరుపతి, ప్రచార కార్యదర్శి పుల్లూరు తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి రాజబాబు, గడిపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి రామస్వామి, ఎరుకల శేఖర్ శ్రావణ్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

రామగిరి, ఫిబ్రవరి 6: రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన కడారి లక్ష్మయ్య అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఓసీపీ-1లో పనిచేసే సింగరేణి కార్మికుడు రేండ్ల కుమారస్వామి రూ.5వేలను మృతుడి భార్య సుశీలకు ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మయ్య కూతురు ఉన్నత చదువులకు ఫీజు చెల్లిస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట మెట్టు ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

మంథని, ఫిబ్రవరి 6: వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంథనికి చెందిన సీనియర్ జర్నలిస్టు రావికంటి శ్రీనివాస్ మంగళవారం నియమితులయ్యారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)కు అనుబంధంగా ఉండి పాత్రికేయుల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కృషి చేస్తున్నారు.

కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మంగళశారం కుష్ఠు నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 30 నుంచి ఈ నెల 13వరకు కుష్ఠు నివారణపై అవగాహన కార్యక్రమాలు గ్రామ గ్రామాన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ బీ దేవిసింగ్, హెచ్ఈఓ శ్రీనివాస్, వినీత్, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఏఎన్ఎం సరోజన, ఆశాలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 6: మండలంలోని చిన్నరాతిపల్లి మాజీ సర్పంచ్ దాసరి నవలోక, మాజీ వార్డు మెంబర్లకు మంగళవారం ఎంపీపీ సంపత్‌తో పాటు పలువురు అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంపీడీవో రాంమోహనచారి, ఎంపీవో గోవర్ధన్, డిప్యూటీ తహసీల్దార్ ధీరజ్‌కుమార్, డాక్టర్ మహేందర్, దాసరి మహేందర్, మాజీ సర్పంచ్ తులా మనోహర్‌రావు, దాసరి నరేందర్, దాసంరి విష్ణు, గ్రామ కార్యదర్శి మల్లీశ్వరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారుకు బిల్‌ను అందజేస్తున్న అధికారులు

ధర్మారం, ఫిబ్రవరి6: గృహజ్యోతి పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి డివిజనల్ విద్యుత్ ఇంజనీర్ డి.తిరుపతి అన్నారు. మంగళవారం ధర్మారంలో ఆయనతో పాటు సంబంధిత అధికారులు గృహజ్యోతి పథకంపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో 200యూనిట్ల వరకు ఉచితంగా కరెంట్ ఇస్తామని ఎలాంటి బిల్లు రాదని ఆయన వివరించారు. ఇందుకు గాను తమ స్పాట్ బిల్లింగ్ సిబ్బంది 200యూనిట్లు విద్యుత్ ఉచిత లబ్ధి పొందే వినియోదారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్‌నంబరును అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఐ.కనకయ్య, ఏఈలు ఖాశీం, సురేష్, స్పాట్ బిల్లింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించాలి

ధర్మారం ఎంపీడీవో జయశీల

ధర్మారం, ఫిబ్రవరి6: గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ధర్మారం ఎంపీడీవో బి.జయశీల ప్రత్యేక అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నేటి నుంచి జరిగే పారిశుధ్య కార్యక్రమంపై ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఏ. రజిత, పంచాయతీ రాజ్ డీఈ శంకరయ్య, ఆయా గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రక్తదానం

మంథని, ఫిబ్రవరి 6: మహిళా రోగికి అత్యవసరంగా రక్త ఎక్కించాల్సి ఉండటంతో జడ్పీ చైర్మన్ పుట్ట మధు తనయుడు పుట్ట శ్రీహర్ష మంగళవారం రక్తం చేశారు. మెదక్ జిల్లా సిద్దిపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన జోగిపర్తి మౌనిక అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చేరగా ఆమెకు అత్యవసర నిమిత్తం రక్తం అవసరం ఉండగా విషయం తెలుసుకున్న శ్రీహర్ష ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు.

జేఎన్టీయూలో ముగిసిన వర్క్‌షాప్

రామగిరి, ఫిబ్రవరి 6: మండలంలోని జేఎన్టీయూ కళాశాల(మంథని)లో రెండు రోజుల పాటు మెకానికల్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. స్పేస్ ఛేజ్ సహకరంతో డ్రోన్లపై వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు హాజరైన వివిధ కళాశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు డ్రోన్లపై అవగాహన కల్పించేందుకు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. రెండోవ రోజున డ్రోన్ల విడి పరికరాలతో బిగింపు చేశారు. తయారు చేసిన 25 డ్రోన్లను కళాశాల క్రీడా మైదానంలో ఎగురేశారు. ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, విభాగాధిపతులు దుర్గారావు, శ్రీనివాసులు, రాంనరేష్, రవీకుమార్, స్వప్న, స్టూడెంట్ కోఆర్డినేటర్స్ సాయి, ఈశ్వర్, మేఘన పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 6: వ్యవసాయ క్షేత్రాల్లో మోతాదుకు మించి రసాయనిక ఎరువులను వాడొద్దని మండల వ్యవసాయాధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలో వరి పంటల క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో సురేష్, రైతులు ఉన్నారు.

'రాజకీయ వివక్షకు గురవుతున్న మాదిగలు'

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి6: మాదిగలు రాజకీయ వివక్షకు గురవుతున్నారని, పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని దళిత సామాజిక వర్గానికి కేటాయించాలని దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాదిగ చైతన్య వేదిక ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లిలో జనాభా ప్రాతిపాదికన మాదిగలు అధికంగా ఉన్నా ఇప్పటివరకు ప్రాతినిధ్యం వహించే అవకాశం రాలేదన్నారు. పార్టీలకు అతీతంగా స్థానికంగా ఉన్న వారికే ఎంపీ టికెట్ కేటాయించాలని తెలిపారు. ఈనెల 14న అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మార్చి 5న 10వేల మందితో పెద్దపల్లిలో మాదిగ డప్పులతో ర్యాలీ చేపట్టి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో సంకనపల్లి లక్ష్మణ్, కోటగిరి పాపయ్య, మాటూరి దుర్గయ్య అరికీల లక్ష్మణ్, కల్వల మల్లేశం, బొంకురి సాగర్, తాండ్ర శ్రీనివాస్, నరుమెట్ల రామస్వామి,తదితులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై కొరడా

-హద్దురాళ్ల తొలగింపు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 6: పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లపై అధికారులు దృష్టిసారించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లలో హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామ పంచాయతి పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌లు ఏర్పాటు చేశారని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హద్దు రాళ్లను తొలగించినట్లు పేర్కొన్నారు.